nipuna
Every Wednesday Free Supplement
05.
17 జనవరి 2024
పేజీలు 8

### ఇఫ్తార్ విందుకు యునెస్కో గుర్తింపు

రంజాన్ నెలలో ముస్లింలు ఇచ్చే ఇఫ్తార్ విందుకు యునెస్కో (ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంస్థ) డిసెంబర్ 10న గుర్తింపు లభించింది. ఇరాన్, టర్కీ, అజర్‌బైజాన్, ఉజ్బెకిస్థాన్ సంయుక్తంగా చేసిన ప్రతిపాదనను ఆమోదించింది. ఈ విందు వల్ల కుటుంబం, కమ్యూనిటీ సంబంధాలు బలోపేతమవుతాయని, దాతృత్వం, సంఘీభావం, సాంఘిక మార్పిడిని ప్రోత్సహిస్తుందని వెల్లడించింది. ఉపవాసం వల్ల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులు తమ పిల్లలకు వివరిస్తారని, సాంఘిక విలువలు పెంపొందుతాయని వివరించింది.

# ఎంచుకున్న కోర్సులతో ఎన్నో అవకాశాలు

**పదో తరగతి వార్షిక పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది. మార్చి, ఏప్రిల్‌లో పరీక్షలు పూర్తవుతాయి. ఆ తర్వాత వేసవి సెలవులు. పది తర్వాత పదకొండు, ఆ తరువాత పన్నెండు. ఈ లెక్క మామూలే. కానీ 11వ తరగతి అంటే ఇంటర్‌లో చేరేముందు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఒక నిర్ణయం తీసుకోవాలి. ఈ నిర్ణయం భవిష్యత్తును తీర్చిదిద్దేలా ఉండాలి. ప్రతి విద్యార్థి తనకున్న ఆసక్తిని, సామర్థ్యాన్ని, కెరీర్‌కు ఉన్న అవకాశాలను బట్టి కోర్సును ఎంపిక చేసుకోవాలి. ఈ ప్రయత్నంలో సలహా కోసం తెలిసినవారిని, ఉపాధ్యాయులను, అంతర్జాలం మాధ్యమాల సలహాలు, సూచనలు తీసుకోవాలి. విద్యార్థులు తమకు నచ్చిన బాట ఎంచుకొని, అనుకున్నది సాధించే వరకు పట్టుదలగా ఉండాలి.**



## పది, ఇంటర్ తర్వాత కెరీర్

### కోర్సులు

- జనరల్ ఇంటర్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీతో పాటు కామర్స్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ సబ్జెక్ట్స్ ఉన్నాయి. ఇవి సైన్స్, కామర్స్ లేదా ఆర్ట్స్ ప్రోగ్రాంలో భాగంగా ఎంచుకోవాలి. వీటితో పాటు లాంగ్వేజ్ పేపర్లు ఉంటాయి.
- ప్రతి సంవత్సరం లక్షల మంది ఇంజినీరింగ్, మెడికల్ ఎంట్రన్స్ పరీక్షలు రాస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా అన్నింటి కంటే ఎక్కువ ఆదరణ వీటికే ఉంది. మెడిసిన్‌కు చాలా డిమాండ్ ఉంది. ఇంటర్‌లో బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు తీసుకున్నవారికి మెడికల్ అడ్మిషన్ పరీక్షకు అర్హత ఉంటుంది. మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ తీసుకున్నవారు ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు రాస్తారు.
- అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల గురించి తెలుసుకుని, వాటికి అనుగుణంగా సబ్జెక్టులను ఎంచుకోవాలి.
- మెడిసిన్, ఇంజినీరింగ్‌లతో పాటు మరెన్నో ఆప్షన్ల నుంచి నచ్చిన బాటను ఎంచుకోవచ్చు.

### లా

- ఇంటర్ తర్వాత లా చేయాలనుకుంటే అయిదేళ్ల ప్రోగ్రాంలో చేరాలి. ఇందులో బీఏ ఎల్ఎల్‌బీ, బీకాం ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ ఎల్ఎల్‌బీ లాంటి ప్రోగ్రామ్స్ ఉన్నాయి. లాయర్, అడ్వకేట్, జడ్జి లాంటి కెరీర్ పట్ల మక్కువ ఉన్న వారు ఈ కెరీర్‌ని ఎంచుకోవచ్చు. కంపెనీల లీగల్ టీమ్స్‌లో లేదా లీగల్ అడ్వైజర్లుగా కూడా పనిచేసే అవకాశం ఉంటుంది. లా ఎంట్రన్స్ కోసం రాసే పరీక్షల్లో ముఖ్యమైనది క్లాట్ (https://consortiumofnlus.ac.in/). లా ఎంట్రన్స్ పరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్, జనరల్ నాలెడ్జ్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ లీగల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్ ఉంటాయి. ఇంటర్‌లో ఏ స్ట్రీమ్‌లో చేరిన వారైనా ఈ కోర్సులో చేరవచ్చు.

### మేనేజ్‌మెంట్

- పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో, కార్పొరేట్ హౌసెస్‌లో మేనేజరియల్ స్కిల్స్ ఉన్నవారికి డిమాండ్ ఎంతో ఉంది. దేశంలో సుమారు 5000 బిజినెస్ స్కూళ్లు ఉన్నాయని ఒక అంచనా. బీబీఏ అంటే బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్. ఎంబీఏ అంటే మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్. కుటుంబ వ్యాపారం సొంత వ్యాపారం వైపు మొగ్గు చూపేవారు. మేనేజ్‌మెంట్ కెరీర్ పట్ల ఆసక్తి ఉన్నవారు, ఇంటర్ తర్వాత బీబీఏ, బీఎంఎస్ ప్రవేశ పరీక్షలు రాయవచ్చు. వీరు ఇంటర్‌లో మ్యాథమెటిక్స్ ఉండేలా చూసుకుంటే కొంచెం ఎక్కువ అనుకూలంగా ఉంటుంది. ఎంబీఏకి పేరున్న ఐఐఎంలు, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఇన్ మేనేజ్‌మెంట్ (5 సంవత్సరాలు) కోర్సులు ప్రవేశపెట్టారు. ఇవి బ్యాచిలర్స్, మాస్టర్స్ డిగ్రీని ఇస్తాయి. ఈ పరీక్షలు ఇంగ్లిష్ లాంగ్వేజ్, ఆప్టిట్యూడ్ లాజికల్ రీజనింగ్ సబ్జెక్టుల్లో నిర్వహిస్తారు. ఎవరైనా IPMAT, JIPMAT, UGAT వంటి పరీక్షలు ఇంటర్ తరువాత రాయవచ్చు. కొన్ని కళాశాలలు ప్రోగ్రామ్స్‌లో మ్యాథమెటిక్స్, బిజినెస్ స్టడీస్, అకౌంటెన్సీ వంటివి ఉండాలని ఆశిస్తారు. మ్యాథమెటిక్స్ చదివినవారు బీబీఏ కంప్యూటర్ అప్లికేషన్స్, బీబీఏ ఐటీ కోర్సులు చేయవచ్చు.
- హోటల్ మేనేజ్‌మెంట్ కోర్స్ కోసం రాసే పరీక్షల్లో ప్రధానమైనది NCHM JEE. బ్యాచిలర్ ఇన్ హోటల్ మేనేజ్‌మెంట్, ట్రావెల్, హాస్పిటాలిటీ, కలినరీ స్కూల్ ఇలా ఎన్నో కోర్సులు ఉన్నాయి. డిప్లొమా ప్రోగ్రామ్స్, సర్టిఫికెట్ కోర్సులు కూడా ఉన్నాయి. హాస్పిటల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్ మేనేజ్‌మెంట్ ఇలా గ్రాడ్యుయేషన్‌లో ఎంచుకున్న కోర్సులను బట్టి ఎన్నో అవకాశాలు ఉన్నాయి.
- గ్రాడ్యుయేషన్ అయిన తర్వాత, మాస్టర్స్ ఇన్ మేనేజ్‌మెంట్ చేయాలనిపిస్తే క్యాట్ పరీక్ష రాయాలి.

### కామర్స్

- కామర్స్ కోర్సుల్లో చేరే వారు సాధారణంగా కామర్స్, అకౌంట్స్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, మ్యాథమెటిక్స్ వంటి సబ్జెక్ట్స్ చదువుతారు. అకౌంటింగ్, ఫైనాన్స్, బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్ సెక్టార్లలో ఉద్యోగం చేయాలనుకునేవారికి సరైన కోర్సు. అలాగే చార్టెర్డ్ అకౌంటెన్సీ, కాస్ట్ అండ్ వర్క్స్ అకౌంటెంట్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ అనలిస్ట్, సర్టిఫైడ్ ఇన్వెస్ట్‌మెంట్ అనలిస్ట్ లేదా కంపెనీ సెక్రటరీ లాంటి కెరీర్‌లు లభిస్తాయి. బీకాం రెగ్యులర్, బీకాం ఆనర్స్, బీకాం ఇంటర్నేషనల్ బిజినెస్, బీకాం ఫైనాన్స్ ఇలా ఎన్నో కోర్సులున్నాయి. CUET రాస్తే దేశంలోని అనేక సెంట్రల్, ఇతర యూనివర్సిటీల్లో వివిధ కామర్స్‌తో పాటు ఇతర కోర్సుల్లో చేరే అవకాశం ఉంది. సీఏ అంటే చార్టెర్డ్ అకౌంటెన్సీ. ఇది ప్రొఫెషనల్ కోర్సు. పది తర్వాత ఫౌండేషన్ కోర్సు నుంచి మొదలవుతుంది. కామర్స్ లేదా ఇతర గ్రాడ్యుయేట్స్ డైరెక్ట్ రూట్ ఇంటర్మీడియట్ పరీక్ష నుంచి మొదలవుతుంది. న్యూ స్కీం ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ జూలై 2023 నుంచి అమల్లోకి వచ్చింది. https://www.icai.org/post/ announcement-new-scheme-of-education-and-training సీఏ లాగానే కాస్ట్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్, కంపెనీ సెక్రటరీ లాంటి ఆసక్తికరమైన కోర్సులు ఎన్నో ఉన్నాయి. కంప్యూటర్ అప్లికేషన్స్‌కు సంబంధించిన కోర్సులు చేసే అవకాశం కూడా ఉంది.

### డిజైన్

- డిజైన్ కోర్సుల్లో ఇంటర్ తర్వాత లేదా గ్రాడ్యుయేషన్ తర్వాత కూడా చేరవచ్చు. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్, ఫ్యాషన్ డిజైనింగ్, గ్రాఫిక్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్, ఫర్నిచర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్, యానిమేషన్ డిజైన్, ఫిలిం అండ్ వీడియో డిజైన్ ఇలా ఎన్నో కోర్సులున్నాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (NID), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (NIFT) దేశంలో ప్రముఖ కాలేజీలు. అలాగే uceed పరీక్ష ద్వారా కొన్ని ఐఐటీలు డిజైన్ కోర్సులను అందిస్తున్నాయి. ఆప్టిట్యూడ్, క్రియేటివ్ ఎబిలిటీ ఇందులో ప్రధానంగా పరీక్షిస్తారు.
- బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీకి ఎంపీసీ చదవాలి. ఇంటీరియర్ డిజైన్ కోర్స్ వారికి మ్యాథమెటిక్స్ ఉంటే ఉపయోగపడుతుంది. కొన్ని పరీక్షలు ఏ స్ట్రీమ్ వారైనా రాయవచ్చు.

### హ్యూమానిటీస్

- హ్యూమానిటీస్ స్ట్రీమ్‌లో చేరినవారు ఇంగ్లిష్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జియోగ్రఫీ, సోషియాలజీ, సైకాలజీ వంటి సబ్జెక్ట్స్ చదువుతారు. ఆ తర్వాత వారికి నచ్చిన కోర్సులో బ్యాచిలర్స్ ప్రోగ్రాంలో చేరవచ్చు. ఎకనామిక్స్, ఫైన్ ఆర్ట్స్, ఫారిన్ లాంగ్వేజ్, జర్నలిజం, క్రిమినల్ లా, లైబ్రరీ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇలా ఎన్నో బీఏ కోర్సులున్నాయి. వీరు కంటెంట్ రైటర్స్, లాంగ్వేజ్ ట్రైనర్లు , హిస్టోరియన్ , సైకాలజిస్ట్ వంటి ఇతర ఉద్యోగ అవకాశాలు పొందవచ్చు. CUET, TISS, HSEE వంటి పరీక్షలు రాయవచ్చు.

### సైన్స్

**బీఎస్సీ:** సైన్స్ సబ్జెక్టుల పట్ల అవగాహన కలిగిన వారు ఇంటర్ పూర్తయిన తర్వాత బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ కోర్సుల్లో చేరవచ్చు. బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, జువాలజీ, బోటనీ, ఎకనామిక్స్ లాంటి స్టాండర్డ్ అండ్ రెగ్యులర్ కోర్సులు, కంప్యూటర్ సైన్స్, మాస్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ మీడియా లాంటి ఆధునిక కోర్సులు, ఓషనోగ్రఫీ, సెరీకల్చర్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, డెయిరీ టెక్నాలజీ, ఫోరెన్సిక్ సైన్స్ లాంటి వైవిధ్య సబ్జెక్ట్స్ ఎన్నో ఉన్నాయి.

### మెడికల్

- ఎంబీబీఎస్ అంటే బ్యాచిలర్ ఆఫ్ మెడిసిన్ అండ్ బ్యాచిలర్ ఆఫ్ సర్జన్. వైద్య విద్యకు సంబంధించి అలాగే ఆయుర్వేద, యునాని, వెటర్నరీ, డెంటల్ వంటి ఎన్నో కోర్సులున్నాయి. నీట్ (https://ntaneet.nic.in/) మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్‌లో ప్రధానమైంది.
- అగ్రికల్చర్ సైన్సెస్, వెటర్నరీ సైన్సెస్ కోర్సులు చేయవచ్చు. ఫార్మసీ రంగంలో కూడా ఎన్నో అవకాశాలున్నాయి.

### ఇంజినీరింగ్

- నిట్, ఐఐఐటీలో సీట్ కోసం జేఈఈ మెయిన్స్ (https://jeemain.nta.ac.in) ఎంట్రన్ పరీక్ష రాయాలి. ఐఐటీ సీటు కోసం మెయిన్స్‌తో పాటు అడ్వాన్స్‌డ్ పరీక్ష కూడా క్వాలిఫై కావాలి, మంచి ర్యాంకు సాధించాలి. ఇంజినీరింగ్ చేయాలనుకునేవారు రాష్ట్రస్థాయి పరీక్షలు కూడా రాస్తారు. ఇంజినీరింగ్ కాలేజీలు బీటెక్ లేదా బీఈ పట్టా ఇస్తాయి. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్‌కి సంబంధించి బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ ప్లానింగ్, బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ వంటి కోర్సులు చేయవచ్చు. నాటా వంటి పరీక్షలు, జేఈఈలో బీ ఆర్క్ పేపర్ రాయాలి.

**ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్స్:** ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్స్ సాధారణంగా ఐదు సంవత్సరాలుంటాయి. ఇంటిగ్రేటెడ్ కోర్సులు చాలా రకాల సబ్జెక్ట్స్‌లతో రూపుదిద్దుకున్నాయి. బిట్స్ పిలానీ, జేఎన్‌టీయూ లాంటి ఎన్నో కళాశాలల్లో ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్స్ అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లాంటివి ఇంటిగ్రేటెడ్ సైన్స్ కోర్సెస్ ఆఫర్ చేస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఇలా ఎన్నో ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి. కొన్ని కోర్సుల్లో విద్యార్థులు ఇండియాలో కొన్ని సంవత్సరాలు, ఇతర దేశాల్లో కొన్ని సెమిస్టర్లు పూర్తి చేస్తారు.

### ఐటీఐ

- వివిధ కర్మాగారాల్లో కావలసిన స్కిల్డ్ వర్కర్లను సమకూర్చడానికి గవర్నమెంట్ ఈ కోర్సును ప్రారంభించింది. ఈ కోర్సులో చేరాలంటే 10వ తరగతి తర్వాత చేరవచ్చు. కొన్ని కోర్సులకు 8వ తరగతి పాసైనా సరిపోతుంది. https://iti.telangana.gov.in/. ట్రైనింగ్ పీరియడ్‌లో సుమారు 70 శాతం ప్రాక్టికల్ ట్రైనింగ్‌లోనే నడుస్తుంది.

### పాలిటెక్నిక్

- 10వ తరగతి తర్వాత ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్, టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో చేరాలనుకునేవారు పాలీసెట్ పరీక్ష రాయాలి. ఈ కోర్సు పూర్తయిన తర్వాత టెక్నీషియన్‌గా లేదా టెక్నికల్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. లేదంటే బీటెక్, బీఎస్సీ, బీకాం వంటి కోర్సులు కూడా చేయవచ్చు. https://polycet.sbtet.telangana.gov.in/

### డిఫెన్స్ ఫోర్సెస్

- బ్యాచిలర్ అఫ్ సైన్స్, ఆర్ట్స్, ఇంజినీరింగ్ వంటి డిగ్రీలు ఉన్నవారు నేషనల్ డిఫెన్స్ అకాడమీ పరీక్షలు రాసి ఇండియన్ ఫోర్సెస్‌లో చేరవచ్చు. నేవీ, ఎయిర్ ఫోర్సెస్‌లో చేరాలంటే ఇంటర్‌లో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ ఉంటే బాగుంటుంది.

---

- పై కోర్సులే కాకుండా లిబరల్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, స్పోర్ట్స్ అండ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ వంటి అనేక రంగాల్లో అవకాశాలు ఉన్నాయి.
- కాబట్టి ఇష్టమైన కెరీర్‌ని బట్టి దానికి తగిన సబ్జెక్టులను ఇంటర్‌లో ఎంచుకోవాలి.

Sirisha Reddy
Director - Academics
Gyanville Academy
91 76759 62248
www.gyanville.in
IITJEE | CLAT | IIM IPM

